


చీనీ @రూ.23 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23 వేలు పలికాయి.



కిలో టమాట రూ.13

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.9.50 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.2°/ 16.8°

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదు కాగా, రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. గంటకు 6 నుంచి 8 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రయాణికుల భద్రతే ధ్యేయం



అధికారులకు సూచనలిస్తున్న ప్రత్యేక బృందం అధికారులు

అనంతపురం సిటీ: రైల్వే ప్రయాణికులకు పూర్తిస్థాయి భద్రత కల్పించడంతో పాటు సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే రైల్వే శాఖ ధ్యేయమని ప్రత్యేక బృందంలోని డిప్యూటీ చీఫ్ సేఫ్టీ అధికారి రవికుమార్, డిప్యూటీ సీఎస్‌ఓ నాగయ్య తెలిపారు. సిగ్నలింగ్ వ్యవస్థ లోపాల గుర్తింపునకు ప్రత్యేక బృందం గురువారం అనంతపురానికి చేరుకుంది. గూడ్స్, రైళ్ల రాకపోకల సమయంలో రెండు వ్యవస్థల పని తీరును పరిశీలించారు. ఈ రెండు వ్యవస్థలు సమర్థవంతంగా పని చేస్తే రైళ్ల ప్రమాదాలు దాదాపుగా ఉండవన్నారు. రైల్వే స్టేషన్‌లో సిగ్నలింగ్, ఆపరేటింగ్ వ్యవస్థలు సమర్థవంతంగానే ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్ కుమార్, సీనియర్ డీఎస్‌ఓ చంద్రశేఖర్, డీఎస్‌టీఈ శ్రీనివాసులు, ఏఓఎం లక్ష్మీనాయక్‌తో మాట్లాడారు. పైలెట్లు సిగ్నలింగ్ వ్యవస్థను అనుసరిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.

29 వరకూ వినతుల స్వీకరణ



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ

పుట్లూరు/శింగనమల: పంట నమోదు వివరాలను ప్రతి రైతు భరోసా కేంద్రంలో ప్రచురించామని, జాబితాలో ఎలాంటి తప్పిదాలు ఉన్నా ఈ నెల 29వ తేదీ వరకు వినతులను స్వీకరిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. గురువారం ఆమె పుట్లూరు, శింగనమల మండలం బండమీదపల్లి రైతు భరోసా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పప్పుశనగ పంపిణీపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏడీఏ చెంగళరాయుడు, వీహెచ్ఏ మురళీ పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా



అనంతపురం అగ్రికల్చర్: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు శనివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక కోర్టురోడ్డులోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. అమరరాజాగ్రూప్, ఫ్లిప్‌కార్ట్, ఎస్ఎస్ మ్యాన్‌పవర్ సెక్యూరిటీ సర్వీసెస్, వైభవ్ సెక్యూరిటీ ఫోర్స్ తదితర కంపెనీల్లో మిషన్ ఆపరేటర్, డెలివరీ ఎగ్జిక్యూటివ్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డ్ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఏ.కళ్యాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ ఉత్తీర్ణతతో పాటు 18 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉన్న యువత అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ వేతనం ఉంటుందని పేర్కొన్నారు.

నాలుగు రైళ్లు తాత్కాలిక రద్దు



అనంతపురం సిటీ: అనంతపురం మీదుగా వివిధ ప్రాంతాలకు నడిచే నాలుగు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ గురువారం తెలిపారు. ధర్మవరం-మచిలీపట్నం మధ్య నడిచే రైలు (నంబర్: 17216) గురువారం నుంచి నవంబర్ 3వ తేదీ వరకు రద్దు చేసినట్లు వివరించారు. మచిలీపట్నం-ధర్మవరం మధ్య నడిచే రైలు (నంబర్: 17215) వచ్చే నెల 2వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. యశ్వంత్‌పూర్-మచిలీపట్నం మధ్య తిరిగే రైలు(నంబర్:17212) ఈ నెల 31 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు రద్దు చేయగా, మచిలీపట్నం-యశ్వంత్‌పూర్ మధ్య నడిచే రైలు(నంబర్: 17211)ను నవంబర్ ఒకటో తేదీ (ఒక్క రోజు మాత్రమే) రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ ప్రకటించారు. ప్రయాణికులు ఆయా తేదీల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూసుకోవాలని సూచించారు.

జగన్‌తోనే బడుగులకు మేలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, చిత్రంలో మంత్రులు ఉషశ్రీచరణ్, గుమ్మనూరు జయరాం, ప్రభుత్వ విప్ కాపు, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఎంపీలు రంగయ్య, మాధవ్, సురేష్, ఎమ్మెల్సీ మంగమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, తదితరులు



బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని

- ప్రభుత్వంలో అన్ని వర్గాలకు పెద్ద పీట
- సామాజిక సాధికారతను చేతల్లో చూపిన జగనన్న
- బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్ బోన్ అని నిరూపించారు
- సంక్షేమ సర్కారును ఆదరించండి
- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి
- ఘనంగా ప్రారంభమైన సామాజిక సాధికార బస్సు యాత్ర
- తరలివచ్చిన ప్రజానీకం

బుక్కరాయసముద్రం: సీఎం వైఎస్ జగనన్నతో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. 'సామాజిక సాధికార బస్సు యాత్ర'లో భాగంగా బీకేఎస్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గుమ్మనూరు జయరాం, ఉషశ్రీ చరణ్, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, వై.వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, సిద్దారెడ్డి, ఎమ్మెల్సీలు శివరామిరెడ్డి, మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి, ప్రభుత్వ సలహాదారు (విద్య) ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రాజారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీం అహ్మద్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్ యాదవ్, ఆర్టీసీ రీజనల్ చైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, అనంతపురం మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, తదితరులు హాజరయ్యారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ జగనన్న సీఎం అయ్యాక రాష్ట్రం సస్యశ్యామలమైందన్నారు. శింగనమల చెరువు లోకలైజేషన్‌కు చొరవ చూపి ఇక్కడి ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారన్నారు. సంక్షేమ పథకాలతో 76 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు మైనార్టీలు లబ్ధి పొందారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మంత్రి పదవులు కేటాయించారని కొనియాడారు. జగనన్న పిలుపిచ్చిన మేరకు 175కు 175 సీట్లు సాధించుకునే వరకూ విశ్రమించమన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు చెప్పుకునేందుకు ఒక్క పథకమైనా ఉందా అని ప్రశ్నించారు.

'సాధికారత'ను తెలియజేసేందుకే యాత్ర

గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు పెద్ద పీట వేసి సామాజిక సాధికారత అంటే ఏంటో సీఎం వైఎస్ జగన్ చేసి చూపారని డిప్యూటీ సీఎం అంజాద్ బాషా అన్నారు. ముఖ్యమంత్రి చేసిన మంచిని వివరించేందుకే బస్సు యాత్రలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతితో కలిసి శింగనమలలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి మాట్లాడుతూ సీఎం జగన్ రాజకీయంగా ఎంతో మందికి పదవులు ఇచ్చారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సముచితం స్థానం కల్పించారన్నారు. మంత్రులు గుమ్మనూరు జయరాం, ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబాపూలే అడుగు జాడల్లో నడుస్తూ సామాజిక సాధికారత కల్పించారన్నారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు బ్యాక్ బోన్ క్లాస్ అని నిరూపించారని ప్రశంసించారు. ప్రతి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చైతన్య పరిచేందుకే బస్సు యాత్ర చేపట్టామన్నారు. బాపట్ల ఎంపీ నందిగాం సురేష్ మాట్లాడుతూ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిందన్నారు. సామాన్యులను సైతం పార్లమెంటుకు పంపిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని ఆయన విమర్శించారు.

అర్హత ఉంటే ఇంటికే 'సంక్షేమం'

ఎంపీ రంగయ్య మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా నిలిచేలా సీఎం వైఎస్ జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. నేరుగా రూ. 2 లక్షల 38 వేల కోట్లను పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారన్నారు. పారదర్శకంగా పథకాలు అమలు చేశారని, అర్హత ఉంటే ఇంటి వద్దకే 'సంక్షేమం' చేరుతోందని తెలిపారు. జగనన్న ధైర్యంతోనే ఇంత మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ప్రజా ప్రతినిధులు ప్రజల వద్దకు వచ్చి మాట్లాడగలుగుతున్నామని తెలిపారు. ఎంపీ మాధవ్ మాట్లాడుతూ జగనన్న విజయ యాత్రను ఎవరూ ఆపలేరన్నారు. బస్సు యాత్ర చేపట్టిన చంద్రబాబు నేడు జైలు యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. లోకేష్ పాదయాత్ర చేసి ఢిల్లీ యాత్ర చేశారని, పవన్ కళ్యాణ్ వారాహియాత్ర చేపట్టి పారిపోయే యాత్ర ప్రారంభిస్తున్నారని విమర్శించారు.

జనమే జనం..

- శింగనమలలో మధ్యాహ్నం 3 గంటలకు సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభమైంది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- శింగనమల నుంచి బుక్కరాయసముద్రం వరకూ సాగిన యాత్రలో వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.
- తరలివచ్చిన జనంతో బుక్కరాయ సముద్రం కిటకిటలాడింది.
- వైఎస్సార్ సీపీ సంక్షేమ పాలన తెలియజేస్తూ సాగిన పాటలకు డ్యాన్సులు చేస్తూ పలువురు ఆకట్టుకున్నారు.
- వాహన దారులకు ఇబ్బందులు లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.
- తరలివచ్చిన ప్రజలకు తాగునీరు, భోజన సదుపాయాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలూరి రమణా రెడ్డి ఏర్పాటు చేశారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



ఇళ్ల పైకి ఎక్కి ప్రజాప్రతినిధుల ప్రసంగం వింటున్న ప్రజలు



డప్పు వాయిద్యాలకు చిందేస్తున్న వైఎస్సార్ సీపీ కార్యకర్త



బస్సు యాత్రలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ఉత్సాహం



వైఎస్సార్ సీపీ జెండాతో సీఎం జగన్ అభిమాని

విషాద పయనం

- కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం
- 13 మంది దుర్మరణం
- 10 మంది జిల్లావాసుల మృత్యువాత
- మృతుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు చిన్నారులు
- దసరా ఉత్సవాలు ముగించుకుని వెళ్తుండగా దుర్ఘటన



లారీని ఢీకొని నుజ్జునుజ్జయిన టాటా సుమో

పుట్టపర్తి టౌన్/గోరంట్ల: వారంతా కూలీలు. జీవనోపాధి కోసం పొట్ట చేత పట్టుకుని బెంగళూరు వెళ్లారు. దసరా నేపథ్యంలో సొంత గ్రామాలకు వచ్చారు. ఎంతో సంతోషంగా ఊరిలో గడిపారు. పండుగ ముగియడంతో మళ్లీ కూలి పనుల కోసం నగరానికి బయలుదేరారు. ఇంకొంత దూరం వెళ్తే గమ్యస్థానానికి చేరే వారే. అయితే, ఊహించని రీతిలో సంభవించిన ప్రమాదం వారి ప్రాణాలు కబళించింది. బంధువులను దుఃఖసాగరంలోకి నెట్టింది. కర్ణాటకలోని చిక్కబళ్లాపూర్ సమీపంలో గురువారం రోడ్డుపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను టాటా సుమో ఢీకొన్న ఘటనలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 10 మంది దుర్మరణం చెందారు. మృతుల్లో గోరంట్ల, ఓడీ చెరువు మండలాలకు చెందిన వారు ఆరుగురు, పెనుకొండకు చెందిన వారు ఇద్దరు, చిలమత్తూరు, కొత్తచెరువు మండలాలకు చెందిన ఇద్దరు ఉన్నారు. అందులో ముగ్గురు మహిళలు, ఓ బాలుడు ఉండడం గమనార్హం.

ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి

పెనుకొండ: రోడ్డు ప్రమాద ఘటనపై ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన చిక్కబళ్లాపురం తరలివెళ్లారు. ఆస్పత్రి వద్ద మృతుల బంధువులను పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ. 10 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

కుమారుడి చదువుల కోసం బెంగుళూరుకు..



వెంకటనారాయణ, సుబ్బమ్మ (ఫైల్)

ఓడీ చెరువు మండలం నవాబుకోట గ్రామానికి చెందిన వెంకటనారాయణ, సుబ్బమ్మ దంపతులు. ఇద్దరు కుమారులు సంతానం. చిన్న కుమారుడు రాజేష్ చదువుల నిమిత్తం బెంగళూరు వెళ్లారు. వెంకటనారాయణ అక్కడి ఓ ప్రైవేటు కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనికి కుదరగా, సుబ్బమ్మ అటెండర్‌గా పనిచేసేది. రాజేష్ అదే విద్యాలయంలో డిగ్రీ చదివేవాడు. పెద్ద కుమారుడు రాజశేఖర్ గోరంట్లలోని చౌడేశ్వరీ కాలనీలో మగ్గం పని చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా, రెండు రోజుల క్రితం ఇక్కడికి వచ్చారు. రాజేష్ ఇక్కడే ఉండిపోగా, దంపతులిద్దరూ బెంగళూరు బయలుదేరారు. రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులు మృతి చెందారన్న విషయం తెలుసుకున్న కుమారులు కన్నీరుమున్నీరయ్యారు.


చావులోనూ ఒక్కటిగా..



వెంకటాద్రి, లక్ష్మి (ఫైల్)

గోరంట్ల మండలం వానవోలు గ్రామానికి చెందిన బోయ వెంకటాద్రి (27), బోయ లక్ష్మి (23)కి రెండేళ్ల క్రితం పెళ్లి జరిగింది. ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. వెంకట్రాది బెంగళూరులో పెయింటింగ్ పనులకు వెళ్లేవాడు. ఆయన భార్య లక్ష్మి గార్మెంట్స్‌లో పని చేసుకుంటూ జీవనం సాగించేవారు. 3 రోజుల క్రితం దసరా పండగతో పాటు సమీప బంధువులకు చెందిన ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు సొంతూరు వచ్చారు. తిరిగి బెంగళూరు వెళ్లే క్రమంలో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న ఇరు కుటుంబాల వారు కన్నీటిపర్యంతమయ్యారు.

పెద్దదిక్కు మృతి..



నరసింహమూర్తి (ఫైల్)

ప్రమాదంలో మృతి చెందిన ఏడుగురిలో సుమో డ్రైవర్ నరసింహమూర్తి ఒకరు. ఈయనది గోరంట్ల మండలం కళ్లగేర గ్రామం. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సుమో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఉన్నంతలో కుటుంబం ఆనందంగా ఉండేది. అయితే, ప్రమాదంలో నరసింహమూర్తి మృతి చెందడంతో ఆ కుటుంబం దిక్కులేనిదిగా మారింది.

తల్లితో పాటే కుమారుడు..



శాంతమ్మ (ఫైల్)



రాజవర్ధన్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో పెనుకొండ మండలం గోనిపేటకు చెందిన శాంతమ్మతో (37), ఆమె కుమారుడు రాజవర్ధన్ (16) దుర్మరణం పాలయ్యారు. ప్రస్తుతం వీరు గోరంట్ల మండలం కాటేపల్లిలో నివాసం ఉంటున్నారు. గోనిపేట గ్రామంలో 10 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నా పంటలు పెట్టుకోలేక బెంగళూరులో పనులు చేసుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. ఎంతో పట్టుదలతో శాంతమ్మ కూలీగా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేదని గుర్తు చేసుకుంటూ గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

చెల్లి సీమంతానికి వచ్చి వెళ్తుండగా..



అరుణ (ఫైల్)

గోరంట్ల చౌడేశ్వరీ కాలనీకి చెందిన మల్లికార్జున కుమార్తె అరుణ (38), ఆమె ఏడేళ్ల కుమారుడు రుత్విక్‌లు ప్రమాదంలో కన్నుమూశారు. చెల్లెలు రాజేశ్వరి సీమంతం వేడుకల్లో పాల్గొనేందుకు నాలుగు రోజుల క్రితం అరుణ, కుమారుడితో కలిసి వచ్చింది. ఎంతో ఆనందంగా గడిపిన ఆమె తిరిగి బెంగళూరు వెళ్తుండగా ప్రమాదంలో మృతి చెందారు. అరుణ భర్త బెంగళూరులో ఓ ప్రవేట్ బ్యాంక్‌లో పనిచేస్తున్నట్లు తెలిసింది.

ముంబై నుంచి వచ్చి..



నారాయణప్ప

ఓడీ చెరువు మండలం మలకవారిపల్లి గ్రామానికి చెందిన నారాయణప్పకు ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమారులు ఉండగా, ఒక కుమారుడు ముంబైలో ఉంటున్నాడు. చిన్న కుమారుడు బెంగుళూరులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని రోజులుగా ముంబైలో పెద్ద కుమారుడి వద్ద ఉంటున్న నారాయణప్ప దసరా పండుగకు స్వగ్రామం మలకవారిపల్లికి వచ్చాడు. గురువారం బెంగుళూరులో ఉన్న చిన్న కుమారుడిని చూసేందుకు బయలుదేరాడు. అనుకోని ప్రమాదం ఆయన ప్రాణాలు బలిగొంది.

రెండేళ్ల క్రితమే వివాహం.. 6 నెలల కుమారుడు



పవన్‌కుమార్ (ఫైల్)

కొత్తచెరువు మండలం గోరంట్లపల్లికి చెందిన పవన్‌కుమార్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. డిగ్రీ పూర్తి చేసిన పవన్ బెంగుళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండేళ్ల క్రితం తనకల్లు మండలం ఈతోడు గ్రామానికి సంధ్యతో వివాహం జరిగింది. 6 నెలల కుమారుడు కూడా ఉన్నాడు. భార్య పుట్టినింట్లో ఉంది. పండుగ నేపథ్యంలో ఈతోడు వచ్చాడు. గురువారం తిరిగి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించేందుకు వెళ్తూ ప్రాణాలు కోల్పోయాడు. భర్త మరణ వార్త తెలుసుకున్న సంధ్య గుండెలవిసేలా రోదించింది. ఆమెను ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు.

రేపు వాల్మీకి జయంతి

అనంతపురం రూరల్: మహర్షి వాల్మీకి రాష్ట్రస్థాయి జయంతిని శనివారం అనంతపురంలో నిర్వహిస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూ కొఠారి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నగరంలోని పవర్ ఆఫీస్ ఎదుట ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం 1,200 మంది మహిళలతో బోనాల ఊరేగింపుతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం కేఎస్ఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జయంతి కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు కసాపురం ఆలయం మూసివేత

గుంతకల్లు రూరల్: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 28న కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానాన్ని మూసివేయనున్నట్లు ఈఓ గురుప్రసాద్ తెలిపారు. 29వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి



వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్రశిక్ష ఆధ్వర్యంలో అమలవుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని సమగ్రశిక్ష అడిషనల్ కోఆర్డినేటర్ జూలకంట వరప్రసాద రావు తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న ఈయనను ఇటీవలే ప్రభుత్వం సమగ్రశిక్ష ఏపీసీగా నియమించింది. ఈ క్రమంలో గురువారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎఫ్ఏఓ హరిప్రియ, సూపరింటెండెంట్ సునిల్, జీసీడీఓ మహేశ్వరి, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, గురుముని కృష్ణ, అలెస్కో గోవిందరెడ్డి,ఐఈ కోఆర్డినేటర్ షమా, అసిస్టెంట్ ఏఎంఓలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఆయనకు బొకేలు అందజేశారు. అనంతరం విభాగాల వారీగా సెక్టోరియల్ అధికారులతో సమీక్ష చేశారు. ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకునే ప్రతి కార్యక్రమాన్ని వందశాతం అమలు చేయాల్సిందేనని సిబ్బందికి స్పష్టం చేశారు.

క్లుప్తంగా

ఆదర్శ ప్రాయుడు వాల్మీకి



వాల్మీకి విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

బ్రహ్మసముద్రం: సమాజంలో అందరికీ ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి అని మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. బ్రహ్మసముద్రం మండలం గొంచిరెడ్డిపల్లిలో గురువారం ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశేష పూజల అనంతరం మంత్రి మాట్లాడుతూ... వాల్మీకి మహర్షి జీవనం ఆదర్శప్రాయమని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖరరెడ్డి, జెడ్పీటీసీలు బొమ్మన్న, రాధాస్వామి, వీర శైవ లింగాయత్ డైరెక్టర్ ప్రసాదరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బోయ పాలాక్షి , వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, నాయకులు అశోక్‌రెడ్డి, వాల్మీకి సేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు ములకనూరు గోవిందు, మండల అధ్యక్షుడు నాగిరెడ్డిపల్లి గోవిందు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొండాపురం రాము, ఎంపీటీసీ నరసింహ, సర్పంచ్ తలారి గోవిందప్ప, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు

- జీఆర్‌పీ ఎస్పీ కె.చౌడేశ్వరి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్పీ చౌడేశ్వరి

గుంతకల్లు: రైలు ప్రయాణికుల భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు జీఆర్‌పీ ఎస్పీ కె.చౌడేశ్వరి తెలిపారు. గుంతకల్లు రైల్వే సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణపై సంబంధిత అధికారులతో గురువారం తన చాంబర్‌లో ఆమె సమీక్షించారు. గతంలో జరిగిన నేరాల దర్యాప్తు పురోగతిపై ఆరా తీశారు. ఆయా కేసుల్లో అరెస్ట్ అయిన నేరస్తుల వివరాలు, స్వాధీనం చేసుకున్న సొత్తు, డిటెక్షన్ కానీ కేసుల దర్యాప్తులో తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీలు, సీఐలతో చర్చించారు. ప్రయాణికులకు గట్టి భద్రత కల్పించాలని ఆదేశించారు. రాత్రి పూట నేరాల నియంత్రణకు గస్తీ పెంచాలన్నారు. పాత నేరస్తుల కదిలికలపై నిఘా ఉంచాలన్నారు. రైళ్ల ద్వారా గంజాయి, సారా, మద్యం తదితర రవాణాను అరికట్టాలన్నారు. ఈ అంశంలో ఆర్‌పీఎఫ్, ఎస్ఈబీ అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. సమావేశంలో డీఎస్పీ అబ్దుల్‌అజీజ్, డివిజన్ సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ప్రాణాలు హరిస్తున్న పొగమంచు



పొగమంచులో ప్రయాణిస్తున్న వాహనదారులు



పొగమంచులో హిందూపురం పట్టణం

- వేకువ జామునే దట్టంగా అలుముకుంటున్న వైనం
- చిక్కబళ్లాపురం ఘటనకు కారణం పొగమంచే

హిందూపురం అర్బన్: జిల్లాల్లో పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కర్ణాటక ప్రాంతానికి ఆనుకుని ఉండడం కారణంగా హిందూపురం ప్రాంతంలో ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా నమోదవుతున్నాయి. దీంతోపాటు తేమ గాలులు ఎక్కువగా వీస్తుండడంతో పొగమంచు కమ్మేస్తోందని వాతావరణ నిపుణులు అంటున్నారు. అయితే ఏటా మాదిరిగానే ఈసారి కూడా జిల్లాలో పొగమంచు ప్రభావం ఆరంభంలోనే చేదు అనుభవాన్ని మిగిల్చింది. గురువారం వేకువజామున పొగమంచు కారణంగా చిక్కబళ్లాపురం వద్ద చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన 13 మంది ప్రాణాలు కోల్పోయారు. రెండేళ్ల క్రితం కూడా పేరసంద్రం వద్ద జీపు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు. రెండురోజుల క్రితం పొగమంచు కారణంగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు కర్ణాటక సరిహద్దున ఆదెపల్లి వద్ద ప్రమాదానికి గురయ్యారు. ప్రస్తుతం వీరు బెంగళూరులో చికిత్స పొందుతున్నారు.

దట్టంగా కురుస్తున్న పొగమంచు..

వారం రోజులుగా సూర్యోదయం కన్నా ముందు, సూర్యాస్తమయం తర్వాత చలి తీవ్రత బాగా పెరిగింది. ఈ ప్రభావంతో పొగమంచు దట్టంగా అలముకోవడంతో రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. హిందూపురం చుట్టుపక్కల పొగ మంచు ఈ సారి మరింత ఎక్కువగా ఉండే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఫిబ్రవరి మొదటివారం వరకూ ఇదే పరిస్థితి ఉంటుంది. ఇప్పటికే 44వ జాతీయ రహదారిపై ఎదురుగా వెళుతున్న వాహనాలను సైతం గుర్తించలేని పరిస్థితి నెలకొంది. దీనికి తోడు వాహనాల హెడ్‌లైట్లను డ్రైవర్లు ఇష్టానుసారంగా మార్చడంతో పాటు డిజైన్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల పొగమంచు ఏర్పడినప్పుడు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఆర్‌టీఏ అధికారులు పేర్కొంటున్నారు.

పురంలో ఉష్ణోగ్రతలిలా..

తేదీ	పగటి వేళ	రాత్రి వేళ
22	29°	19°
23	29°	18°
24	28°	18°
25	27°	17.8°

జాగ్రత్తలు తప్పనిసరి

రాత్రి వేళ, వేకువ జామున రోడ్లపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. పొగమంచు ఎక్కువగా ఉంటే వాహనాలు పక్కన ఆపి విశ్రాంతి తీసుకోవడం ఉత్తమం. హెడ్‌లైట్లను ఇష్టానుసారంగా మార్చడం ప్రమాదాలకు దారి తీస్తుంది. పొగమంచులో ప్రయాణించాల్సి వస్తే లోబీమ్ లైట్లను వాడాలి. దీంతో ఎదురుగా వస్తున్న వాహనదారులకు మన వాహనం స్పష్టంగా కనిపిస్తుంది.

– కరుణసాగర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి, హిందూపురం

ప్రభుత్వ లాంఛనాలతో కానిస్టేబుల్ అంత్యక్రియలు



గాలిలోకి కాల్పులు జరుపుతున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ సురేష్ (40) మృతదేహానికి గురువారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కళ్యాణదుర్గం మండలం గోళ్ల గ్రామానికి చెందిన సురేష్ 2009లో కానిస్టేబుల్‌గా విధుల్లో చేరారు. రొద్దం, ఎస్సీకుంట, కనగానపల్లి, కళ్యాణదుర్గం పోలీసు స్టేషన్లలో ఆయన పనిచేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బుధవారం రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. సురేష్‌కు భార్య సుజాత, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కార్యక్రమంలో కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ హరినాథ్, ఎస్ఐలు సుధాకర్, నాగమధు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భవన నిర్మాణాల్లో జాప్యాన్ని సహించం

- పీఆర్ ఎస్ఈ భాగ్యరాజ్

అనంతపురం సిటీ: ప్రభుత్వ భవన నిర్మాణాల పురోగతిలో వెనుకబడితే సహించేది లేదని పంచాయతీరాజ్ ఇంజినీర్లను ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) భాగ్యరాజ్ హెచ్చరించారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలపై గురువారం ఈఈలు, డీఈఈలు, ఏఈలు, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమీక్షించారు. అనంతరం జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. గ్రామ సచివాలయాలతో పాటు రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీలు, పాల కేంద్రాల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. పురోగతిలో చాలా మండలాలు వెనుకబడి ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోపు నిర్మాణాలు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నెలాఖరులోపు అన్నీ భవన నిర్మాణాలు మొదలు కావాల్సిందేనని స్పష్టం చేశారు.

ఎస్‌జీఎఫ్ ఎంపిక షెడ్యూల్ విడుదల

అనంతపురం: అండర్–19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపికకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. ఈ మేరకు అనంతపురం ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ జి.లక్ష్మీనారాయణ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2005, జనవరి 1 తర్వాత జన్మించిన విద్యార్థులు అర్హులు. పదో తరగతి మార్కుల లిస్ట్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్ సంతకం చేయించి తీసుకు రావాలి. విద్యార్థి పదో తరగతి చదువుతుంటూ స్టడీ, బర్త్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలపై హెడ్‌మాస్టర్‌తో సంతకం చేయించుకుని సమర్పించాల్సి ఉంటుంది. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు సంబంధిత క్రీడాసామగ్రిని వెంట తీసుకెళ్లాలి.

వివిధ క్రీడలకు సంబంధించి ఎంపిక షెడ్యూలు ఇలా..

తేదీ	క్రీడ	ఆట స్థలం	సంప్రదించాల్సిన నంబర్
27, అక్టోబర్	జిమ్నాస్టిక్స్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం	94412 84618
27, అక్టోబర్	మాల్‌కం	ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం	94412 84618
28, అక్టోబర్	కరాటే	ఇండోర్ స్టేడియం, అశోక్‌నగర్, అనంతపురం	94412 84618
28, అక్టోబర్	సాఫ్ట్ టెన్నిస్/టెన్నిస్	నారాయణ టెన్నిస్ అకాడమీ, మారుతీనగర్, అనంతపురం	95738 23616
30, అక్టోబర్	స్విమ్మింగ్	గిరీష్ స్విమ్మింగ్ అకాడమీ, ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ ఎదురుగా, అనంతపురం	98494 55465
31, అక్టోబర్	వెయిట్ లిఫ్టింగ్	ఇండోర్‌స్టేడియం, అశోక్ నగర్, అనంతపురం	94402 15690
02, నవంబర్	సైక్లింగ్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం	
07, నవంబర్	స్కేటింగ్	80 అడుగుల రోడ్డు, రాంనగర్, అనంతపురం	89783 14415
07, నవంబర్	సెపక్‌తక్రా	సెంట్రల్ స్కూల్, ఉరవకొండ	99512 73139
04, నవంబర్	షూటింగ్ బాల్	ప్రభుత్వ జూనియర్ కళాశాల, అనంతపురం	95730 65966

ఓపీ 5,710.. రెఫరల్ 210

అనంతపురం మెడికల్: జిల్లా వ్యాప్తంగా 14 ప్రాంతాల్లో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో మొత్తం 5,710 మంది ఓపీ సేవలు పొందారు. ఇందులో 900 మంది వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద పరీక్షలు చేయించుకున్నారు. 210 మందిని జిల్లా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు స్పెషలిస్టు వైద్యులు రెఫర్ చేశారు. శెట్టూరు పీహెచ్‌సీ పరిధిలోని యాటకల్లు గ్రామంలో జరిగిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ గౌతమి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి పరిశీలించారు.

నేడు 14 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

జిల్లాలోని కక్కలపల్లికాలనీ, వడియంపేట, పీకే చెరువు, రాళ్ల అనంతపురం, నార్పల, తబ్జుల, సలకంచెరువులోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అనంతపురంలోని శ్రీనివాసనగర్, వేణుగోపాల్‌నగర్, గుత్తి చెట్నేపల్లి, గుంతకల్లు భాగ్యనగర్, సత్యనారాయణపేట, కళ్యాణదుర్గం ఇందిరమ్మ కాలనీ, తాడిపత్రి పాతకోట ప్రాంతాల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి తెలిపారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు

యాడికి: వివాహితను లోబర్చుకుని తన వెంట పిలుచుకెళ్లిన ఘటనలో ఓ యువకుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గురుప్రసాదరెడ్డి తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. యాడికి మండలం పిన్నేపల్లికి చెందిన ఓ వివాహితను అదే గ్రామానికి చెందిన సతీష్ మాయమాటలతో లోబర్చుకుని తన వెంట పిలుచుకెళ్లాడు. దీనిపై వివాహిత భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. తిరుపతిలో ఆమె ఆచూకీని గుర్తించి బుధవారం అక్కడకెళ్లి పిలుచుకొచ్చారు. విచారణ అనంతరం గురువారం వివాహితను భర్తకు అప్పగించి, ఆమె ఫిర్యాదు మేరకు సతీష్‌పై కేసు నమోదు చేశారు. అజ్ఞాతంలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నాణ్యమైన విద్యను అందించండి

- విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య

రాప్తాడు: పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో భాగంగా కార్పొరేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దిందని విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య అన్నారు. ఏపీలో విద్యా వ్యవస్థను భారతదేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాలు పరిశీలిస్తున్నాయని, ఈ క్రమంలో ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా నాణ్యమైన విద్యను అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాప్తాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. మనబడి నాడు–నేడు కింద చేపట్టిన పనులు పరిశీలించారు. విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. ఈ ఏడాది పదో తరగతిలో వంత శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రతి ఒక్కరూ కష్టపడి చదవాలని, ఇందుకోసం ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా సిద్ధం కావాలని సూచించారు. పాఠశాల వేళల అనంతరం స్టడీ అవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠ్యాంశాల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఆంగ్ల బాషపై విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగించేందుకు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే ఉపాధ్యాయులపై చర్యలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ వెంకటరమణ, ఎస్ఐలు జయపాల్‌రెడ్డి, శేషగిరి, హెచ్‌ఎం నరసింహులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య

ఏకాగ్రతతోనే లక్ష్య సాధన



రైఫిల్ షూటింగ్‌పై శిక్షణ ఇస్తున్న ఎన్‌సీసీ అధికారులు

కూడేరు: ఏకాగ్రత ఉంటేనే రైఫిల్ షూటింగ్‌లో లక్ష్యాన్ని ఛేదించగలుగుతారని క్యాడెట్లకు ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ అక్షయ్ మాథుర్ సూచించారు. 28 ఆంధ్రా బెటాలియన్ సీఏటీసీ–9వ ఎన్‌సీసీ శిక్షణా తరగతుల్లో భాగంగా కూడేరు మండలం ఎన్‌సీసీనగర్‌లో గురువారం క్యాడెట్లకు రైఫిల్ షూటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. దేశ సరిహద్దుల్లో శత్రు సైన్యం దండెత్తకుండా ఆర్మీ జవాన్లు ఎలా పోరాడుతారనే అంశంపై అవగాహన కల్పించారు. ఫైరింగ్‌లో ప్రతిభ కనబరిచిన క్యాడెట్లను క్యాంప్ కమాండర్ అభినందించారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన 450 మంది క్యాడెట్లు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లోనే కార్పొరేట్ వైద్య సేవలు

శెట్టూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా గ్రామాల్లోనే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతోందని కలెక్టర్ గౌతమి అన్నారు. గురువారం మండల పరిధిలోని యాటకల్లులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో నిర్వహించిన హెల్త్ క్యాంపును ఆమె పరిశీలించారు. వైద్య సేవలపై స్థానికులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలెక్టర్ మాట్లాడారు. రోగులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మందులేవైనా లేకుంటే ఇండెంట్ పెట్టాలని డీఎంహెచ్‌ఓ భ్రమరాంబను ఆదేశించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉన్న ఊర్లోనే అతి ఖరీదైన వైద్యం అందిస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని గ్రామీణులకు సూచించారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ రూపకల్పనే ప్రభుత్వ లక్ష్యమన్నారు. యాటకల్లులో త్రిపురాభ అనే దివ్యాంగురాలు తనకు సదరం క్యాపులో సర్టిఫికెట్ వచ్చేలా చూడాలని కోరగా, స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది మనవతా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాణిసుస్మిత, డీఎల్‌డీఓ శంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత, స్పెషల్ ఆఫీసర్ నీలమయ్య, తహసీల్దార్ ఫణికుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, జెడ్పీటీసీ మంజునాథ, స్థానిక సర్పంచ్ ఈరన్న, మాజీ ఎంపీపీ రామభీమప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు ఎర్రిస్వామి, ఎంపీటీసీ నాగవేణి, డాక్టర్లు వేణుకార్తీకేయ, తరుణ సాయి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

'పది'లో టాప్ లేపాలి

పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో టాప్‌లో ఉండాలని కలెక్టర్ ఎం. గౌతమి సూచించారు. గురువారం శెట్టూరు మండల కేంద్రంలోని ఏపీ మోడల్ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులందరిలో పోటీ తత్వం ఉండాలన్నారు. స్కూల్లో మంచి భవనాలు, మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తరగతి గదుల్లో ఫ్యాన్లు పనిచేయలేదని విద్యార్థులు తెలపడంతో గురువారం సాయంత్రంలోగా సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ పరిశీలించారు. వసతి గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాణి సుస్మిత, డీఎల్‌డీఓ శంకర్, మండల స్పెషలాఫీసర్ నీలమయ్య, తహసీల్దార్ ఫణికుమార్, ఎంపీడీఓ రఘురామరావు, ఎంఈఓలు రాణి, శ్రీధర్, జెడ్పీటీసీ మంజునాథ్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గాయత్రి పాల్గొన్నారు.

అప్రమత్తతతో ఎఫ్ఎల్‌సీ నిర్వహించాలి

అనంతపురం అర్బన్: అప్రమత్తంగా ఉంటూ ఈవీఎంలు, వీవీప్యాట్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ఎమ్.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన ఈవీఎంల ఎఫ్ఎల్‌సీని కలెక్టర్ గురువారం పరిశీలించి ప్రక్రియ నిర్వహణ తీరును గమనించారు. ఎఫ్ఎల్‌సీ ఎంతమేర పూర్తయ్యేదనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ క్రమంలో ఏదశలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, ఎఫ్ఎల్‌సీ పర్యవేక్షక అధికారి రవీంద్ర, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, తహసీల్దారు శ్రీధర్‌మూర్తి, ఎన్నికల విభాగం డీటీ కనకరాజు, ఎస్ఏ శామ్యూల్ బెంజిమన్, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యం అధిగమించాలి


అనంతపురం అర్బన్: ''నవరత్నాలు– పేదలందరికీ ఇల్లు పథకం కింద లక్ష్యం మేరకు ఇళ్ల నిర్మాణం జరగాలి. డిసెంబరు ఆఖరుకు రెండో దశ గృహప్రవేశాల మహోత్సవం ఉంటుంది. కేటాయించిన 25 వేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి.'' అని కలెక్టర్ ఎమ్.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణం అంశంపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో హౌసింగ్ పీడీ నరసింహారెడ్డితో కలిసి హౌసింగ్, మండల ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, నిర్మాణ సంస్థలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజువారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని పురోగతి సాధించాలని సూచించారు. ''ఆప్షన్–3 ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు ఏజెన్సీలకు అడ్వాన్స్ ఇచ్చేందుకూ సిద్ధంగా ఉన్నాం. బిల్లుల చెల్లింపునకు ఇబ్బంది లేదు. నిర్మాణ పనులువేగం పెంచి లక్ష్యం మేరకు నిర్మాణాలు పూర్తి చేయాలి.'' అని సంబంధిత ఏజెన్సీలను ఆదేశించారు. నిర్మాణం చేయలేని పక్షంలో బాధ్యతల నుంచి తప్పుకోవచ్చని ఘాటుగా హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, వెంకటేశ్వర్లు, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, మెప్మా పీడీ విజయలక్ష్మి, డ్వామా పీడీ వెణుగోపాల్‌రెడ్డి, హౌసింగ్ డీఈ కృష్ణారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డీసీపీఓ పోస్టు భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం సెంట్రల్: ఐసీడీఎస్‌కు అనుబంధంగా పనిచేస్తున్న బాలల సంరక్షణ సమితి విభాగంలో ఖాళీగా ఉన్న డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ (డీసీపీఓ) పోస్టు భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 42 ఏళ్లలోపు వయసు, సోషల్ వర్క్, సోషియాలజీ, చైల్డ్ డెవలప్‌మెంట్ కమ్యూనిటీ రీసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో పీజీ చేసిన వారు అర్హులు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 28వ తేదీ నుంచి నవంబర్ 6లోపు ఐసీడీఎస్ పీడీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. పూర్తి వివరాలకు ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేద్దాం

- బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఉదయ్‌కిరణ్




గుంతకల్లు: వైఎస్సార్‌సీపీ చేపట్టిన సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని బీసీలకు బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు డేరంగుల ఉదయ్ కిరణ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బీసీ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బీసీలకు పెద్దపీట వేసిన పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీనేనని కొనియాడారు. బీసీలంటే బ్యాక్ వార్డ్ క్లాస్ కాదు బ్యాక్ బోన్ క్లాస్‌గా గుర్తించి వారిని అన్ని విధాలుగా ఆదుకున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. నాలుగేళ్ల పాలనలో బీసీ కుటుంబాలకు రూ.1.62 లక్షల కోట్లు ఆర్థిక సాయం అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. దీంతో సామాజిక సాధికార యాత్రకు బీసీ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు.

రేపటి నుంచి జూడో జట్ల ఎంపిక

ధర్మవరం రూరల్: ఏపీ ఎస్‌జీఎఫ్ ఇంటర్ డిస్ట్రిక్ జూడో చాంపియన్ షిప్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే జిల్లా జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించనున్నట్లు ధర్మవరం మండలం చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకూ చిగిచెర్ల పాఠశాలలో సెలక్షన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్–14, అండర్–17, అండర్–19 బాల, బాలికల విభాగాల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వ్యక్తి బలవన్మరణం



పెద్దయ్య (ఫైల్)

ఆత్మకూరు: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఆత్మకూరు మండలం సనప గ్రామానికి చెందిన పెద్దయ్య (40), లలిత దంపతులకు ఓ కుమార్తె ఉంది. తమకున్న కొద్ది పాటి పొలంలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. కుమార్తెకు వివాహం చేశారు. ఈ క్రమంలో పంటల సాగులో నష్టాలు రావడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద చేసిన అప్పులు తీర్చడం పెనుభారంగా మారింది. దీంతో మనోవేదనతో అనారోగ్యం పాలయ్యాడు. పలు ఆస్పత్రుల్లో కుటుంబసభ్యులు చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన ఆయన గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

అనంతపురం ఆర్డీఓ గ్రంధి వెంకటేష్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఆర్డీఓ గ్రంధి వెంకటేష్

అనంతపురం రూరల్: అనంతపురం ఆర్డీఓగా గ్రంధి వెంకటేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా అనంతపురం రెవెన్యూ డివిజన్ అధికారి మధుసూదన్ వైఎస్సార్ కడప జిల్లా ఆర్డీఓగా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం ఆర్డీఓగా గ్రంధి వెంకటేష్ ఇక్కడికి వచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ డివిజన్ పరిధిలోని భూసమస్యలు, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన ఆర్డీఓను కార్యాలయ సిబ్బంది, తహసీల్దార్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

29 వరకు జాబితా సరిచూసుకోండి



జాబితాను రైతులతో కలిసి పరిశీలిస్తున్న ఏఓ శేఖర్ రెడ్డి

ఆత్మకూరు: మండలంలోని గ్రామాల్లోని రైతులు ఈక్రాప్ బుకింగ్ అయిన జాబితా ఈనెల 29లోపు సరిచూసుకోవాలని ఏఓ సుచరిత, ఏఈఓ సుజిత తెలిపారు. గురువారం మండలంలోని సనప, వేపచెర్ల, వేపచెర్ల తండా, మదిగుబ్బ గ్రామాల్లో ఈ క్రాప్ బుకింగ్ జాబితాలను వ్యవసాయ సిబ్బంది విడుదల చేశారు.

తప్పొప్పులుంటే సరిచేసుకోండి

రాప్తాడు: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈ క్రాప్ ద్వారా వివరాలు నమోదు చేశామని, జాబితాలో తప్పొప్పులుంటే సరిచేసుకోవాలని ఏఓ శేఖర్ రెడ్డి రైతులకు సూచించారు. గురువారం ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తి చేసిన పంట నమోదు ముసాయిదా జాబితాను ఆర్బీకే కేంద్రాల దగ్గర ఆర్బీకే అధికారులు ప్రచురించారు.


230 పుస్తకాల వితరణ



గ్రంథాలయ సంస్థ కార్యదర్శికి పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

అనంతపురం: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి డాక్టర్ పాణ్యం శ్రీనివాస గురుమూర్తి రచించిన 230 పుస్తకాలను ఉచితంగా అందించారు. రామాయణ కల్పవృక్షం తెలుగుదనం, మాండూక్యోపనిషత్, లక్ష్మీనరస రామణీయకం, శ్రీ బ్రహ్మగుండేశ్వర శతకం పుస్తకాలను గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి పి.రమకు అందజేశారు. డాక్టర్ పాణ్యం శ్రీనివాస గురుమూర్తి దంపతులను సన్మానించారు.

క్రీడలతో మానసికోల్లాసం



కబడ్డీ మ్యాట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థులకు క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి అన్నారు. కళాశాల నిధులు రూ. 3 లక్షలతో ఏర్పాటు చేసిన కబడ్డీ మ్యాట్‌ను ప్రిన్సిపాల్ గురువారం ప్రారంభించారు. అనంతరం కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు చాలా అవసరం అన్నారు. కార్యక్రమంలో పీడీలు జబీవుల్లా, శ్రీరాములు, ఇతర అధ్యాపకులు జీవన్ కుమార్, లక్ష్మీకాంత్, సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాజిక బస్సుయాత్ర విజయవంతం

- శింగనమల నుంచి బుక్కరాయసముద్రం వరకూ సాగిన యాత్ర



సాధికార యాత్రలో పాల్గొన్న మంత్రులు ఉషశ్రీ, అంజాద్ బాషా, గుమ్మనూరు జయరాం, ఎంపీలు రంగయ్య, నందిగామ సురేష్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, నదీమ్ అహ్మద్, మాల్యవంతం మంజుల, హరీష్ యాదవ్



సామాజిక సాధికార యాత్రకు తరలివచ్చిన జనం



శింగనమలలో వైఎస్ విగ్రహంవద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు ఉషశ్రీచరణ్, అంజాద్ బాషా, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తదితరులు



బస్సులో వెళ్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యేలు అనంత, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ

శింగనమల/ బుక్కరాయసముద్రం: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతమైంది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో గురువారం శింగనమలలో ప్రారంభమైన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి భారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివచ్చారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రులు గుమ్మనూరు జయరాం, ఉషశ్రీ చరణ్, ఎంపీలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, బాపట్ల ఎంపీ నందిగామ సురేష్, ఎమ్మెల్యేలు కాపు రామచంద్రారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, దుద్దేకుంట శ్రీధర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ముందుగా వారు అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శింగనమల నుంచి 4గంటలకు బస్సు యాత్ర ప్రారంభమైంది. డీసీఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించాయి. బస్సు టాప్‌పై ఎమ్మెల్యేలు, మంత్రులు నిలబడి అందరికీ అభివాదం చేసుకుంటూ వచ్చారు.

భారీ జనసందోహం : మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన బహిరంగ సభ జనసందోహంతో నిండిపోయింది. సభకు 6 మండలాల నుంచి భారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు తరలివచ్చారు. విచిత్ర వేష ధారణలో కళాకారులు సీఎం వైఎస్ జగన్ పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ అలరించారు. డప్పు కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



మహిళల ఆనందం



గురవయ్యల నృత్యం

372 మందికి వైద్య పరీక్షలు



వేపచెర్లలో రోగులకు మందుల కిట్లను అందిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండలంలోని వేపచెర్లలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వేపచెర్ల, వేపచెర్ల దిగువతండా, వేపచెర్ల ఎగువతండా ప్రజలు 372 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 24 మందిని శస్త్రచికిత్సలకు రెఫర్ చేసినట్లు డాక్టర్ దయాకర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు కాంతమ్మ, లక్ష్మీదేవి, ఎంపీటీసీ వరలక్ష్మి ,ఎంపీడీఓ రఘునాథ్, మండల కన్వీనర్ లక్ష్మీనరసింహులు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బాలపోతన్న, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ వడ్డుపల్లి నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్, యల్లప్ప, కృష్ణానాయక్, గోపాల్‌రెడ్డి, ఆదికొరెడ్డి , గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

అనంతపురం క్రైం: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై వ్యాస రచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించింది. గురువారం పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సిబ్బందికి సైబర్ క్రైం, సోషల్ మీడియా పోకడల నియంత్రణ తదితర అంశాలపై వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులకు మహిళల రక్షణ, చిన్నారులు, లైంగిక వేధింపులు సామాజిక బాధ్యత, పలు అంశాలపై పోటీలు నిర్వహించినట్లు పోలీసువర్గాలు తెలిపాయి.

జీజీహెచ్‌లో వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

అనంతపురం మెడికల్: హైదరాబాద్ ఎస్ అలీ అజాం జోసఫ్ డెవలపర్స్ అండ్ బిల్డర్స్ సౌజన్యంతో ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. గురువారం ఆస్పత్రిలో బోరు బావి తవ్వించారు. మరో వారం రోజుల్లో వాటర్ ఫిల్టర్ పాయింట్ యూనిట్, షెడ్డు ఏర్పాటు చేయనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

ఇంజినీర్ల బాధ్యతారాహిత్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో కొందరు ఇంజినీర్లు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఎర్రనేల కొట్టాలలో రూ.90 లక్షల వ్యయంతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మించారు. పట్టణ ఆరోగ్యం కేంద్రం మెట్లకు, రోడ్డుకు రెండు అడుగుల వరకు వ్యత్యాసం కనిపిస్తోంది. వృద్ధులు, మహిళలు జారిపడే అవకాశం లేకపోలేదు. ర్యాంప్‌పై వెళ్లేందుకు వీలుగా లేకుండా పనులు చేపట్టారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

అనంతపురం క్రైం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు చేపడతామని త్రీటౌన్ సీఐ ధరణీకిశోర్ తెలిపారు. త్రీటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో మద్యం సేవించేందుకు ఏర్పాటు చేసుకున్న స్థావరాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. గొడవలకు ప్రధాన కారణమవుతున్న అల్లరిమూకలు ఎక్కువగా ఈ స్థావరాల్లో మద్యం సేవిస్తున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో, ఆర్టీసీ బస్టాండు ఆరు బయలు ప్రాంతం, రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో కూడా చాలా మంది బహిరంగంగా మద్యం సేవించే వారు ఉన్నట్లు స్థానికులు తమ దృష్టికి తెచ్చారన్నారు. వీరిని కట్టడి చేసేందుకు ప్రత్యేకంగా నలుగురు కానిస్టేబుళ్లతో రౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వారిని బైండోవర్ చేస్తామన్నారు. స్థానికులు తమకు సమాచారం ఇవ్వాలని, లేదా 100 కు ఫోన్ చేయాలని సీఐ కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పగిడిరాయి గ్రామానికి చెందిన చిన్న రంగన్న అనే వ్యక్తి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అపస్మారక స్థితికి చేరుకున్న చిన్న రంగన్నను కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

ఘనంగా గౌరీదేవి నిమజ్జనం

పామిడి: పట్టణంలో గురువారం వాసవీ మాతృ మండలి ఆధ్వర్యంలో గౌరీదేవి నిమజ్జనం ఘనంగా జరిగింది. మేళతాళాలతో అమ్మవారి కీర్తనాలాపనల నడుమ గౌరీదేవి ప్రతిమను ఊరేగించారు. ఎగువపల్లి హెచ్ఎల్‌సీలో నిమజ్జనం చేశారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే అనంత

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం మెడికల్: జనం వద్దకే వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని, మెరుగైన వైద్యం అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని పాతూరు పవర్ ఆఫీస్, ఖాజానగర్‌లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. శిబిరాలకు వచ్చిన వృద్ధులు, మహిళలతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సేవలను వివరించారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు కార్పొరేట్, జిల్లా ఆస్పత్రుల్లో అందే సేవలపై తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మాజీ సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో యాత్ర చేస్తున్నారని విమర్శించారు. ఇన్నాళ్లూ చంద్రబాబు వ్యవస్థలను అడ్డంపెట్టుకొని కోర్టు స్టేలతో జీవితం గడిపారని, ఈ రోజు నిజం గెలిచింది కాబట్టే చంద్రబాబు జైలులో ఉన్నారన్నారు. స్కిల్ స్కాంతో పాటు ఇన్నర్ రింగ్ రోడ్డు అమరావతి, ఫైబర్ గ్రిడ్‌లోనూ అక్రమాలకు పాల్పడ్డారన్నారు. సంకెళ్లు వేసింది చంద్రబాబుకు కాదని, ప్రజలకు వేశారని నారా భువనేశ్వరి అనడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్లు లావణ్య, చంద్రలేఖ, జయలలిత, శ్రీనివాసులు, కమల్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్



మంగాపురం సభలో మాట్లాడుతున్న ఎంపీ గోరంట్ల మాధవ్

రామగిరి: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మంగాపురంలో కనకదాస విగ్రహ ప్రతిష్టకు ఆయన హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ గత ప్రభుత్వాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలను విస్మరించాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా అందరికీ సమన్యాయం చేస్తున్నారన్నారు. రైతు పక్షపాతిగా పేరొందిన వైఎస్ కుటుంబం రాష్ట్ర వ్యాప్తంగా సాగు, తాగు నీటిని అందించినట్లు తెలిపారు. ఎంతో అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు అవినీతి కేసులో జైలులో ఉన్నారని, ఈ ప్రాంతంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా కొన్నేళ్లుగా పదవులు అనుభవిస్తూ ఈప్రాంతానికి చేసిందేమీలేదన్నారు. కనీసం పేరూరు డ్యాంకు నీరుతేలేకపోయారన్నారు. పార్టీ అధికారంలోకిరాగానే ఎంఎల్ఏ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హంద్రీనీవా ద్వారా నీరు తెచ్చారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రతి ఇంటికీ చేరుతున్నాయని, రాబోవు ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాలప్ప, జెడ్పీటీసీ నాగార్జున, ఎజ్జె అంజి, మల్లికార్జున, కురుబలు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలపై టీడీపీ దౌర్జన్యం సరికాదు



రామగిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామగిరి: అణగారిన వర్గాలపై టీడీపీ నాయకుల దౌర్జన్యం సరికాదని ఎస్సీసెల్ నియోజకవర్గ కన్వీనర్ బండారు అనిల్‌కుమార్, మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ హెచ్ఎస్ ముత్యాలు, సర్పంచ్ మీనుగ నాగరాజులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఇటీవల మాజీ జెడ్పీటీసీ రామ్మూర్తి నాయుడు అంగన్‌వాడీ కార్యకర్తల ఇంటర్వ్యూకు వెళ్లకుండా గంగంపల్లికి చెందిన ముకుంద అనే మహిళను గృహ నిర్బంధం చేయించాడన్నారు. దశాబ్దాలుగా ఈప్రాంతంలో టీడీపీ అధికారం ఉండి, అణగారిన వర్గాలను అణచివేస్తున్నారన్నారు. మేం చెప్పిందే వేదం అంటూ వారికి అనుకూలంగా ఉన్నవారికే పదవులు, ఉద్యోగాలు ఇచ్చేవారన్నారు. అయితే పార్టీ మారినా నేటికీ టీడీపీ నాయకుల దాష్టీకాలు, దౌర్జన్యాలు తగ్గిపోలేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, సర్పంచ్ సిద్ధన్న, నాయకులు ఓబులేష్, కేజీ నాగరాజు, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల నివాళి

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వేపకుంట రాజన్న భార్య ప్రమీలమ్మ (51) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సోదరుడు, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, మండల నాయకులతో కలిసి తల్లిమడుగులకు వెళ్లి ప్రమీలమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వేపకుంట రాజన్న, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథ్‌రెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు నాగముని, యూత్ కన్వీనర్ అశోక్, తదితరులు పాల్గొన్నారు.



మృతురాలికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న నాయకులు

హోమియో వైద్యుడు సునీల్‌కుమార్ ఆకస్మికమృతి



అనంతపురం మెడికల్: హోమియో వైద్యుడు డాక్టర్ సునీల్‌కుమార్ నగరంలోని ఆయన నివాసంలో గురువారం గుండెపోటుతో మరణించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ చలపతి హోమియో క్లినిక్‌లో ఆయన ఎనిమిదేళ్లపాటు సేవలందించారు. ఆయన మృతి బాధాకరమని రాష్ట్రీయ ఆయుష్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోగుల కుమారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ సునీల్ కుమార్ సేవలు మరువలేనివన్నారు. శుక్రవారం రాయదుర్గంలో అంత్యక్రియలు జరుగుతాయని తెలిపారు.

8న విద్యాసంస్థల బంద్

గుంతకల్లుటౌన్: కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం నవంబర్ 8న విద్యాసంస్థల బంద్ తలపెట్టినట్లు ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శులు పరమేష్, కుళ్లాయప్ప తెలిపారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, విద్యార్థిసేన నాయకులు సమావేశం నిర్వహించారు. నవంబర్ 8న కేజీ నుంచి పీజీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల బంద్‌కు అందరూ సహకరించాలని వారు కోరారు. విద్యార్థిసేన అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్‌కుమార్, విద్యార్థి సంఘాల నాయకులు రమణయ్య, ఆనంద్, అఖిల్, వెంకట్ నాయక్, వంశీ, సూరి తదితరులు పాల్గొన్నారు.

నేత్రానందం.. శ్రీనివాస కల్యాణం





కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, స్వామివారిని ఊరేగింపుగా తెస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, భక్తాదులు

అనంతపురం కల్చరల్: దసరా ఉత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా గురువారం పద్మావతి సమేత లక్ష్మీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. గురువారం స్థానిక బెంగళూరు రోడ్డు సమీపంలోని శివబాలయోగి ఆశ్రమంలో కల్యాణోత్సవాన్ని అర్చకులు నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సాంప్రదాయబద్ధంగా మాంగళ్యధారణ, ఎదురుకోళ్ల తంతు కమనీయంగా సాగింది. మధ్యాహ్నం మహా ప్రసాద వితరణ, నారాయణ సేవ కార్యక్రమాలు జరిగాయి. అంతకముందు ఆలయ ప్రాంగణంలో నిలువెత్తు వేంకటేశ్వరస్వామి ప్రతిమకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు అరవింద్, రత్నగిరి, దేవరాజ్, విశ్వనాథ్ శెట్టి గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు సీఎం అత్యధిక ప్రాధాన్యత



జై జగన్ ప్లకార్డులను ప్రదర్శిస్తున్న మేయర్ వసీం, చిత్రంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్

అనంతపురం కార్పొరేషన్: మైనార్టీల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు మేయర్ వసీం పేర్కొన్నారు. సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభం కానున్న నేపథ్యంలో గురువారం నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో మేయర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జై జగన్ ప్లకార్డులు ప్రదర్శించారు. మేయర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా మైనార్టీల సంక్షేమానికి సీఎం పెద్దపీట వేశారన్నారు. హజ్‌యాత్రకు వెళ్లే వారిపై అదనపు భారం పడకుండా ఆర్థికంగా అండగా నిలిచారని, ఉర్దూను రెండో అధికార భాషగా గుర్తింపు కల్పించారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో మైనార్టీ సంక్షేమం కోసం రూ.2 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేస్తే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.23 వేల కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా మైనార్టీలకు లబ్ధి చేకూర్చారన్నారు. అనంతపురంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మేయర్‌గా తనకు, 9 మందికి కార్పొరేటర్లుగా, మార్కెట్‌యార్డు చైర్మన్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా మైనార్టీలకు అవకాశం కల్పించారన్నారు. సమావేశంలో మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు నరసింహులు, కమల్ భూషణ్, శ్రీనివాసులు, నాయకులు చింతకుంట మధు, పెన్నోబులేసు, తదితరులు పాల్గొన్నారు.